సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 6 । జూలై । 2024



న్యూస్‌రీల్

కస్తూర్బా బాలికల విద్యాలయం తనిఖీ

- రికార్డులను పరిశీలించిన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: మండలంలోని యండపల్లివలస కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తనిఖీ చేశారు. దీనిలో భాగంగా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టీలను పరిశీలించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఏవోను ఆదేశించారు. విద్యార్థుల నుంచి మెనూ వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు మధ్యాహ్న భోజనాన్ని ఆయన వడ్డించారు.

రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవం రేపు



రేణుకా ఎల్లమ్మ తల్లి

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి శివారులో వేంచేసిన ఊడల మర్రి రేణుకా ఎల్లమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకుడు ముర్ల రాజారెడ్డి తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటలకు వేటమామిడి గ్రామం మధ్య నుంచి బోనాల ఊరేగింపు ప్రారంభం అవుతుందన్నారు. మహిళలు ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి ఉదయం 9 గంటలకు బోనాలు సమర్పిస్తారన్నారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్న అనంతరం ఉదయం 10 గంటలకు శ్రీ చిన్న మస్తా దేవి హోమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. భక్తులంతా విచ్చేసి బోనాల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అర్చకుడు కోరారు.

న్యాయం చేయాలని రంపుల గిరిజనుల వినతి



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సత్కరిస్తున్న రంపుల గిరిజనులు

గూడెంకొత్తవీధి: జాతీయ రహదారి నిర్మాణం వల్ల తాము అన్ని విధాలుగా తీవ్రంగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలని మండలంలోని రంపుల ప్రాంతానికి చెందిన పలువురు గిరిజనులు వాపోయారు. ఇదే విషయంపై వారు శుక్రవారం పాడేరు వెళ్లి కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. జాతీయ రహదారి విస్తరణ వల్ల తమ విలువైన పంటపొలాలు, భూములు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. నిర్మాణ పనుల వల్ల ఉన్న భూముల్లోనూ వ్యవసాయం చేయలేని పరిస్థితి ఎదురైందన్నారు. పాఠశాల భవనం మొత్తం కూలిపోయే పరిస్థితిలో ఉందన్నారు. వీటన్నింటిని గుర్తించి తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రంపుల గ్రామస్తులు వైఎస్సార్‌సీపీనేత కంకిపాటి గిరిప్రసాద్, వీరన్నపడాల్, పోతురాజు హరిప్రసాద్ సీతమ్మ, గోపాల్, నరేష్ పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖ సిబ్బందికి అందని జీతాలు

మధురవాడ: వైద్యారోగ్య శాఖ(నేషనల్ హెల్త్ మిషన్)లో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి ఐదో తేదీ దాటినా జీతాలు అందలేదు. రాష్ట్రంలో 186 కేటగిరీల్లో 22 వేల మంది కాంట్రాక్ట్ పద్ధతిలో వివిధ కేటగిరీల్లో పని చేస్తున్నారు. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 1500 మంది పని చేస్తున్నారు. ఇందులో యూపీహెచ్‌సీల్లో చేస్తున్న వారు 600 మంది, టీబీ విభాగంలో 120 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున జీతాలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికీ జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల స్కూల్ ఫీజులు, రుణాలకు సంబంధించి ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం జీతాలు చెల్లించాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీవీ గోపీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వీరబ్రహ్మం డిమాండ్ చేశారు.

వలిసెకు వన్నెలద్దేలా..

జిల్లాలో వలిసెల సాగుకు పూర్వవైభవం తెచ్చేందుకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కసరత్తు చేస్తున్నారు. దేశంలో ఐదు కేంద్రాల్లో పరిశోధనలు జరగుతుండగా వాటిలో చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఒకటి. 2018 నుంచి ఇక్కడ వలిసెల్లో మూడు వేల రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. రానున్న మూడేళ్లలో వాటి ఫలితాలు అందనున్నాయి.

- చింతపల్లిలో శాస్త్రవేత్తల విస్తృత పరిశోధనలు
- అగ్రి టూరిజంలో ప్రాధాన్యం
- మరో మూడేళ్లలో రైతుల చెంతకు ఫలితాలు
- అందుబాటులోకి రానున్న నూతన వంగడాలు



చింతపల్లి రూరల్: గిరిజన ప్రాంతంలో సాగు విస్తీర్ణం పెంపులో భాగంగా శాస్త్రవేత్తలు కేజేఎస్–2, జేఎన్ఎస్–6 వంటి హైబ్రిడ్ రకాలను సిఫార్సు చేస్తున్నారు. ఒకప్పుడు వలిసెలను ఈ ప్రాంత రైతులు నూనెకోసం పండించేవారు. ఇప్పుడు నూనెతోపాటు పర్యాటకులను ఆకర్షించే విధంగా సాగు విస్తీర్ణం పెంపునకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సహకారం అందిస్తున్నారు.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గతంలో సుమారు 16వేల హెక్టార్లలో సాగయ్యే వలిసెల ఆకాశ పందిరి కలుపు ఉధృతి, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో తగ్గిపోయింది. మూడేళ్లుగా ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడడంతో కేవలం ఆరువేల ఎకరాల్లో మాత్రమే ఈ పంట సాగవుతోంది. పంట విస్తీర్ణం పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నప్పటికీ, రైతులు ఆసక్తి చూపడం లేదు.

అగ్రి టూరిజంలో..

అగ్రి టూరిజం ప్రాజెక్ట్‌లో వలిసెల సాగును స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చేర్చారు. పచ్చని పూలతో ప్రకృతి అందాలకు మరింత శోభను తీసుకురావడం లక్ష్యంగా గతేడాది నుంచి సాగు విస్తీర్ణం పెంపునకు కృషి చేస్తున్నారు.

ఉపయోగాలెన్నో..

వలిసెలతో తయారు చేసిన నూనెను వంటకు వినియోగించడంతో పాటు, ఆహార పదార్థాల తయారీ, పరిశ్రమల్లో రంగులు, సబ్బుల తయారీలో ఈ గింజలను ఉపయోగిస్తారు. నూనె తీయగా వచ్చిన పొట్టును పశువుల దాణాగా, సేంద్రియ ఎరువుగా కూడా వినియోగిస్తుంటారు. దీంతో వలిసెలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో పంట సాగుకు రైతులు ముందుకురావాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

రైతులకు సాంకేతిక ప్రోత్సాహం..

పరిశోధన స్థానంలో నాలుగేళ్ల పాటు అధ్యయనం చేసి, గిరిజన ప్రాంతానికి అనుకూలమైనవిగా నిర్ధారించిన జేఎన్ఎస్–6, 9, 28, 30 రకాల విత్తనాలను విత్తనోత్పత్తికి ఎంపిక చేసిన రైతులకు పంపిణీ చేస్తామని పూర్వ ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. రైతులు పండించిన వంగడాల పంటను కొనుగోలు చేయడమే కాకుండా వచ్చే ఏడాదికి అధికసంఖ్యలో రైతులకు నూతన వంగడాలు అందజేస్తామని గతేడాది ఆయన ప్రకటించారు. వలిసెల సాగులో గిరిజన రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అవసరమైన సాంకేతిక ప్రోత్సాహం అందిస్తున్నామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కోరుతున్నారు.

సాగు ఇలా..

- ఎకరాకు రెండు నుంచి మూడు కిలోలు విత్తుకోవాలి. వరుస క్రమంలో వేయడం వల్ల కలుపు మొక్క బంగారుతీగను నియంత్రించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.హెక్టారుకు 5 నుంచి 6 కిలోల వరకు దిగుబడి వస్తుంది. పంటకాలం 110–120 రోజులు. లేట్ ఖరీఫ్ సాగుకు ఈ పంట అనుకూలం. ఆగస్టు15 నుంచి సెప్టెంబర్ 15లోగా నాటుకోవాలి. డిసెంబర్ నుంచి జనవరి మధ్య పంట చేతికి వస్తుంది. ప్రస్తుతం ఏజెన్సీలో గిరి రైతులు జేఎన్ఎస్ 28, జేఎన్ఎస్30, జేఎన్ఎస్ 9, ఉత్కల్ రకాలు మంచి దిగుబడినిస్తున్నాయి.

వంద సెంటీమీటర్ల వర్షపాతం అవసరం

వలిసెల సాగుకు సరాసరి వర్షపాతం 100 సెంటీమీటర్లు అవసరం. 18 నుంచి 23 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అనుకూలం. నేలలో ఉదజని 5 నుంచి 7 గల ఇసుక, ఒండ్రు, తేలికపాటి గరప నేలలు ఈ పంట సాగుకు అనుకూలం. సెప్టెంబరు మొదటి వారం నుంచి అక్టోబరు మొదటి వారం వరకూ విత్తనాలు వేసుకోవడానికి అనుకూల వాతావరణం ఉంటుంది.

అనుకూలమైన రకాలు

ఏజెన్సీ వాతావరణం, నేలలకు కేజేఎస్–2, జేఎన్ఎస్–6, 9, 28, 30 రకాల వలిసెల విత్తనాలు అత్యంత అనుకూలం.



పరిశోధన స్థానంలో తేనెటీగలు వాలకుండా నెట్‌లో పెంచుతున్న వలిసె మొక్కలు (ఫైల్)



పరిశోధనల్లో భాగంగా వలిసె పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

కేజేఎస్–2 జేఎన్ఎస్–6, 9, 28, 30 రకాలు 50 రోజుల్లో పూతకు వస్తాయి. మొక్క 190 సెంటీమీటర్ల వరకు ఎత్తు పెరుగుతుంది. 100 నుంచి 110 రోజులకు పంట కోతకు వస్తుంది. హెక్టార్‌కు 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం సాగు చేస్తున్న దేశవాళీ రకాల కంటే ఈ రకాలు 40 నుంచి 50 శాతం అధిక దిగుబడిని ఇస్తాయి. 40 శాతానికి పైగా నూనె కలిగి ఉంటాయి.

ఆరేళ్లుగా విస్తృత పరిశోధనలు



గత ఆరేళ్ల నుంచి వలిసెలపై విస్తృత పరిశోధనలు చేస్తున్నాం. మరో రెండు నుంచి మూడేళ్లలో మంచి దిగుబడులు వచ్చే వలిసె రకాలను రైతులకు పరిచయం చేసే అవకాశాలు ఉన్నాయి. రైతులు వలిసెల సాగును నూనె పంటగా భావిస్తారు. ఈ సాగు తేనె తయారీకి ముఖ్య వనరుగా కూడా ఉపయోగపడుతుంది.

– ఎ.శ్రీనివాసరావు, శాస్త్రవేత్త, వలిసెల ప్రాజెక్ట్, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం

‘అపోలో’లో ఉద్యోగాల భర్తీకి 12న ఇంటర్వ్యూలు

అడ్డతీగల: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ఈ నెల 12న అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.అదే రోజు ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల టెన్త్, ఇంటర్, డిగ్రీ, బిఫార్మసీ విద్యార్హతలు ఉన్న వారిని వివిధ స్థాయిల్లో ఉద్యోగాలకు ఎంపికలు చేస్తారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూకు హాజరయ్యేటప్పుడు పాన్,ఆధార్ కార్డులు,విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో రావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు.

యథాస్థానంలో ఉద్యోగం కల్పించాలని వినతి



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేస్తున్న జీఎస్‌ఎంలు

పాడేరు : గ్రామ సచివాలయాల ఏఎస్ఎంగా విధులు నిర్వహిస్తూ 2022 నుంచి 2024 వరకు రెండేళ్ల పాటు జీఎస్ఎం ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి తిరిగి యథావిధిగా వారి స్థానాల్లో ఉద్యోగాలు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామ సచివాలయ ఏఎస్ఎంలు పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను తెలియజేశారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 2022లో సుమారు 21 మంది జీఎస్ఎం ట్రైనింగ్‌కు వెళ్లామన్నారు. ఇటీవలే తమ శిక్షణ పూర్తయినప్పటికీ తమ స్థానాల్లోకి విధులకు పంపించడం లేదన్నారు. ఈ విషయంపై జోక్యం చేసుకొని తమను విధులకు హాజరయ్యేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వైద్యారోగ్య శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. వారి స్థానాలను వారికి యథావిధిగా కేటాయించాలని కోరారు. త్వరలోనే వారిని గతంలో పని చేసిన స్థానాల్లో విధులకు పంపిస్తామని ఆర్‌జేడీ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో వారంతా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం సహాయక సంఘాలకు రూ.3 కోట్ల సాయం

చెక్కు అందజేసిన కలెక్టర్ దినేష్‌కుమార్



స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : స్వయం సహాయక సంఘాలకు అందజేస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో 75 గ్రామ స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు యూనియన్ బ్యాంకు ద్వారా రూ.3 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. ప్రధానంగా కూరగాయలు, కిరాణా, దుస్తుల అమ్మకాలు తదితర వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వారపు సంతల్లో మహిళలు కల్తీ లేని వస్తువులను ప్రజలకు విక్రయించాలని సూచించారు. నాణ్యతతో కూడిన సరుకులను స్వయం సహాయక సంఘాల సభ్యులు వారపు సంతల్లో అమ్మకాలు చేపడితే కల్తీ, నిల్వ వస్తువుల విక్రయాలను అరికట్టవచ్చునన్నారు. వారపు సంతల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు దుకాణాలు కేటాయించి వారిని ప్రోత్సహించాలని ఐటీడీఏ పీవో అభిషేక్‌కు సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు వారపు సంతల్లో ఏర్పాటు చేసే దుకాణాల్లో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని కల్తీ లేని నాణ్యమైన వస్తువులను అమ్ముతున్నట్లు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన ప్రజల ఆరోగ్య, ఆర్థిక, అక్షరాస్యత శాతం పెంచేందుకు స్వయం సహాయక సంఘాలు తోడ్పాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘కిడ్నీ ర్యాకెట్’పై బిగుస్తున్న ఉచ్చు

- కేసు విచారణ వేగవంతం
- డీసీపీ–1తో పాటు 8 మందితో స్పెషల్ టీం
- ఆదేశాలు జారీ చేసిన సీపీ శంఖబ్రత బాగ్చి

సీతమ్మధార : కిడ్నీ సమకూర్చుతానంటూ మోసం చేసిన కేసులో విశాఖ సీతమ్మధారలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిపై ఉచ్చు బిగుస్తోంది. ఈ కిడ్నీ రాకెట్‌పై నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సీరియస్ అయ్యారు. నిందితులపై కఠిన చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. విచారణ వేగవంతం చేయాలని ఇప్పటికే ఆయన ఆదేశాలు జారీ చేశారు. కిడ్నీ రాకెట్ వ్యవహారం నిగ్గు తేల్చేందుకు 8 మందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దీనికి డీసీపీ–1 బి.లక్ష్మీనారాయణ నాయకత్వం వహిస్తున్నారు. ద్వారకా ఏసీపీ ఎస్.రాంబాబు నేతృత్వంలో సీఐ ఎస్.రమేష్‌తో పాటు పెందుర్తి ఎస్ఐలు ఆశిరి తాత, జె.సురేష్, కానిస్టేబుళ్లు ఆర్.సంతోష్, ఎస్.వాసు, జె.శివ, బి.మహేష్ కేసు దర్యాప్తు చేయనున్నారు.

అసలేం జరిగింది?

బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరాల మేరకు..నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో పురుషోత్తపురంలోని జి.బ్లాక్ 310, కంఫర్ట్ హోమ్స్‌లో మూలవెంకట సత్యనారాయణ గోపి, భార్య శారదా లక్ష్మి నివాసముంటున్నారు. లక్ష్మి కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించేవారు. 2022 సెప్టెంబర్‌లో జీవన్‌ధాన్‌లో కిడ్నీ మార్పిడి ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈలోగా తన భార్య ఆరోగ్యం క్షీణించడంతో సీతమ్మధారలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిని గోపి సంప్రదించారు. వైద్యురాలు వాణికి తన భార్య పరిస్థితిని వివరించారు. కిడ్నీలు మార్చితే ప్రాణాపాయం ఉండదని, కిడ్నీల కోసం ఆస్పత్రి కో ఆర్డినేటర్ అనిల్‌ను సంప్రదించాలని సూచించారు. తన దగ్గర దాతలు అందుబాటులో ఉన్నారని, ప్రక్రియ మొత్తానికి రూ.27లక్షలు ఖర్చు అవుతుందని, ముందుగా రూ.10 లక్షలు ఇవ్వాలని అనిల్.. బాధిత కుటుంబానికి చెప్పారు. దీంతో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులో అనిల్ ఖాతాకు దఫదఫాలుగా రూ.10 లక్షలు చెల్లించాడు. రోజులు గడుస్తున్నా కిడ్నీలు ఏర్పాటు చేయకపోగా.. ఫోన్ చేస్తున్నా అనిల్ లిఫ్ట్ చేయడం లేదు. దీంతో బాధిత కుటుంబం మరింత డీలా పడింది. భార్య ఆరోగ్య పరిస్థితి దిగజారడంతో జీవన్‌ధాన్ ద్వారా పినాకిల్ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి ఉచితంగా నిర్వహించారు. ప్రాణాపాయం నుంచి లక్ష్మి గట్టెక్కడంతో అనిల్ వ్యవహారం తేల్చుకోవాలని గోపి ప్రయత్నించారు. ఎస్ఆర్ఐ నెఫ్రాలజిస్టు వాణిని నిలదీయగా.. కిడ్నీ వ్యవహారంలో తన ప్రమేయం ఏమీ లేదని చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఎట్టకేలకు అనిల్ తారసపడడంతో నిలదీయగా.. మీరిచ్చిన రూ.10 లక్షలు ఆస్పత్రి పెద్దలకు ఇచ్చానని.. ఇకపై ఆస్పత్రికి వచ్చి ఆరా తీస్తే ఊరుకునేది లేదని బెదిరించాడు. దీంతో వైద్యురాలు వాణి, ఆస్పత్రి కో–ఆర్డినేటర్ అనిల్ తనను మోసం చేశారని బాధితుడు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ, ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర 420 కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ వినతి

రంపచోడవరం : గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు కోరారు. ఈమేరకు శుక్రవారం రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శి/ఐటీడీఏ సబ్ కమిటీ కన్వీనర్ కె.ఆదిరెడ్డి, సబ్ కమిటీ కోకన్వీనర్ కె. సూరిబాబు, రంపచోడవరం డివిజన్ అధ్యక్షుడు అధ్యక్షులు సనాతన బాబు, దేవీపట్నం మండల ప్రధాన కార్యదర్శి చిన్ని బాబు తదితరులు కలిశారు. వివిధ సమస్యలు పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విల్సన్ బాబు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు సెలవు మంజూరు అధికారాలు ప్రధాన ఉపాధ్యాయులకు గతంలో ఉన్న మాదిరిగా ఉంచాలని పీవోను కోరామని తెలిపారు. ఈ మేరకు గతంలో సహాయ గిరిజన సంక్షేమాధికారులకు ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సెలవు మంజూరుకు సంబంధించి సెలవు చీటీలను సహాయ గిరిజన సంక్షేమాధికారులకు ఈమెయిల్ చేసేలా ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

భారీ వర్షాలకు అధ్వానంగా రహదారి

- దెబ్బతినడంతో అవస్థలు



వర్షానికి దెబ్బతిన్న అమ్మవారి ధారకొండ రహదారి

గూడెంకొత్తవీధి: మండలంలోని అమ్మవారి ధారకొండ పంచాయతీలోని ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షానికి పూర్తిగా దెబ్బతింది. సప్పర్ల నుంచి అమ్మవారి ధారకొండకు పది కిలోమీటర్ల మేర ఇటీవల రహదారిని నిర్మించారు. కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించడం వల్లే వర్షానికి అధ్వానంగా మారిందని ఈప్రాంత గిరిజనులు ఆరోపిస్తున్నారు. కనీసం ద్విచక్రవాహనం సైతం వెళ్లేందుకు ఆస్కారం లేకుండా అధ్వానంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రులకు తరలించేందుకు అవకాశం లేకుండా పోయిందని గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సమస్యలపై వినతుల వెల్లువ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



ప్రజావాణికి హాజరైన అర్జీదారులు

స్వీకరించిన కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఆర్డీవో పద్మావతి అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఐటీడీఏ 11 మండలాల నుంచి వివిధ సమస్యలపై ప్రజల నుంచి 184 వినతులను స్వీకరించారు. ప్రధానంగా సాగునీటి సమస్యలు, చెక్‌డ్యాంల నిర్మాణం, ఆరోగ్య సమస్యలు, వైద్య సేవలు, అంగన్‌వాడీ కేంద్రాల మంజూరు, భూ సమస్యలు, పాఠశాలల్లో సీట్ల కోసం అధికంగా దరఖాస్తులు వచ్చాయి. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వెంకటేశ్వరరావు, టీడబ్ల్యూ ఈఈ రాజు, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఐటీడీఏ ఏవో హేమలత, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పీహెచ్‌వో అశోక్, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందర బాబు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బూరగు, చినకోనెల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం

విద్యుత్‌శాఖ ఈఈ ఏవీఎన్ఎం అప్పారావు

సాక్షి ఎఫెక్ట్..

అనంతగిరి: మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరగు, చినకోనెల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) ఏవీఎన్ఎం.అప్పారావు తెలిపారు. ఏళ్ల తరబడి అంధకారంలో మగ్గుతున్న ఆయా గ్రామాల గిరిజనులునిరసన తెలపడం తెలిసిందే. దీనిపై కాగడాలతో గిరిజనుల నిరసన శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ నయా మహా అభియాన్ పథకం కింద ఆరు కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్‌ను రూ.18 లక్షలతో ఏర్పాటుచేసి రెండు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించినట్లుగా ఆయన తెలిపారు. రెండు వారాల్లో పనులు పూర్తిచేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

లక్ష్యసాధనతో ముందుకు సాగాలి

చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్



మాట్లాడుతున్న చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్

చింతపల్లి రూరల్: గిరిజన నిరుద్యోగ యువతీయువకులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్ అన్నారు. స్థానిక వైటీసీ సెంటర్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగులకు శుక్రవారం వెదురు ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీయువకులు సొంతంగా స్టార్టప్‌లు మొదలు పెట్టి వారి కాళ్ల మీద నిలబడాలని సూచించారు. ఒకరికి ఉద్యోగం కల్పించే స్థాయికి గిరిజన యువతీయువకులు ఎదగాలన్నారు. లక్ష్యసాధన ఉన్న వారు మాత్రమే ఈ పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లగలరని ఆయన పేర్కొన్నారు.. రానున్న రోజుల్లో ఏటికొప్పాక లక్కబొమ్మల మాదిరిగా చింతపల్లిలో వెదురుతో తయారు చేసిన ఉత్పత్తుల యూనిట్లు పెట్టి దేశ వ్యాప్తంగా ఆదరణ వచ్చేలా యువతీయువకులు కృషి చేయాలని కోరారు. మహేశ్వరి ఎడ్యుకేషనల్ సొసైటీ (అచ్యుతాపురం) ఆధ్వర్యంలో వెదురుతో ఫర్నిచర్, హట్‌ల నిర్మాణం, తదితర ఉత్పత్తుల తయారు చేసేలా ఏడాదిపాటు ఉచిత శిక్షణ ఇస్తామని ఆ సంస్థ ఎండీ ధరిమిరెడ్డి ప్రసాద్ తెలిపారు. తొలి ఏడాది 100 మందికి శిక్షణ ఇస్తామన్నారు.ఈ అవకాశాన్ని ఆసక్తి గల నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8500410753 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ అరుణ్‌కిరణ్, ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

8న కిరండూల్ స్పెషల్ రద్దు

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఈ నెల 8న విశాఖపట్నం–కిరండూల్(08551) స్పెషల్, 9న కిరండూల్–విశాఖపట్నం (08552) స్పెషల్‌ను రద్దు చేశారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరాల్సిన రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. షాలిమర్– చెన్నై సెంట్రల్(128410 కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 5.20 గంటలకు, హౌరా–మైసూరు(22817) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 6.10 గంటలకు, సిల్చార్–త్రివేండ్రం సెంట్రల్(12508) ఎక్స్‌ప్రెస్ శుక్రవారం రాత్రి 7.50 గంటలకు బయలుదేరాయి.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న సుబ్బిరెడ్డి

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) శాంతి (టెక్నికల్) తెలిపారు. నాలుగు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 300 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 106 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 26 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సుబ్బిరెడ్డి, శాంతి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, అధికారులు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాతావరణ శాఖ అధికారి బదిలీ

సాక్షి, విశాఖపట్నం : తుపాను హెచ్చరికల కేంద్రంలోని కీలక అధికారిని బదిలీ చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ వాతావరణ శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సునంద రాణిని ఢిల్లీలోని కేంద్ర కార్యాలయానికి బదిలీ చేస్తూ శుక్రవారం జీవో జారీ చేశారు. ఈమె స్థానంలో మరో రెండు రోజుల్లో కొత్త అధికారిని నియమించే అవకాశాలున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నియంత్రణ

చర్యలకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు

సాక్షి,పాడేరు: పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో పర్యాటకశాఖ, పంచాయతీ అధికారులతో సమీక్షించారు. పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, కార్మికులకు తగిన సామగ్రి పంపిణీ చేయాలన్నారు. పంచాయతీలకు పర్యాటకుల నుంచి వచ్చే ఆదాయాన్ని ప్రత్యేక పద్దులో జమచేసి పర్యాటక అభివృద్ధి, పారిశుధ్య పనులకు వినియోగించాలని సూచించారు. పర్యాటక శాఖ కూడా ఆస్తి పన్ను చెల్లించాలని ఆదేశించారు. అరకులోయ, అనంతగిరి మండలాల్లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టుల వివరాలను పంచాయతీ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాస ఫణి, జిల్లా అధికారి దాసు, డీపీవో కొండలరావు, డీఎల్పీవో కుమార్, పలు పంచాయతీల సర్పంచ్‌లు దాసుబాబు, సుస్మిత, జ్యోతి, చినబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఈనెల 8నుంచి ఇసుక విక్రయాలు : ఈనెల 8వతేది నుంచి జిల్లాలో కొత్త ఇసుక పాలసీ ద్వారా ఇసుక విక్రయాలు ప్రారంభించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు.శుక్రవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు,రవాణా,గనులు భూగర్భశాఖ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1.66లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. సీనరేజ్ టన్నుకు రూ.88 మాత్రమేనన్నారు.చింతూరు డివిజన్ గుండాల రీచ్ వద్ద 87,800టన్నులు, గుండాల 2 రీచ్‌లో 79.026 టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు.ఈ సమావేశంలో జేసీ భావన వశిష్ట, ఐటీడీఏ పీవోలు గనోరే,అభిషేక్,చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో అన్న మృతి

- పొరపాటున తమ్ముడు రివర్స్ గేర్ వేయడంతో ఘటన
- పోలీసుల కేసు నమోదు

కొయ్యూరు: ట్రాక్టర్ ప్రమాదంలో రాజవొమ్మంగికి చెందిన చెవాకుల అప్పారావు (40) మృతిచెందినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రత్నంపేట పంచాయతీ పాడి గ్రామంలో వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం రాత్రి దుక్కుసెట్‌తో ట్రాక్టర్ తీసుకెళ్లారు. తమ్ముడు చెవాకుల చంటిబాబు ట్రాక్టర్ నడుపుతుండగా వెనుక ద్విచక్ర వాహనంపై అన్నయ్య అప్పారావు వస్తున్నాడు. పాడి గ్రామం సమీపంలోకి వచ్చేసరికి దుక్కుసెట్ రాడ్ ఊడిపోయింది. ఇది గమనించిన అప్పారావు ట్రాక్టర్ ఆపమని తమ్ముడికి చెప్పాడు. పడిపోయిన రాడ్‌ను సరిచేస్తుండగా ట్రాక్టర్ రివర్స్ గేర్ వేయడంతో ముందుకు వెళ్లాల్సిన వాహనం వెనక్కి వచ్చింది. ఈ క్రమంలో వాహనం అప్పారావును ఢీకొనడంతో పాటు దుక్కిసెట్ రాడ్ ఆయన గుండెకు బలంగా తగలడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతనిని కృష్ణదేవిపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ రామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

విశాఖలో 'బుజ్జి' సందడి



విశాఖ వేలీ స్కూల్‌లో ప్రభాస్ నడిపిన వాహనం బుజ్జి

ఆరిలోవ : పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటించిన 'కల్కి 2898 AD' సినిమా ప్రేక్షకులను విశేషంగా అలరిస్తోంది. ఈ సందర్భంగా 'కల్కి'లో ప్రభాస్ వాడిన వెహికల్ 'బుజ్జి'ని విశాఖలోని విశాఖ వేలీ స్కూల్ ప్రదర్శనకు ఉంచారు. శుక్రవారం బుజ్జిని చూసేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. బుజ్జి వాహనాన్ని వైజయంతి మూవీస్ నిర్వాహకులు గురువారం విశాఖ వేలీ స్కూల్‌కు తీసుకొచ్చి ప్రదర్శనకు పెట్టారు. దీనిపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వాహనాన్ని ఏవిధంగా తయారు చేశారు. మెకానికల్ ఇంజినీర్ల ప్రతిభను వివరించారు. దీనిలో ఎలాంటి భాగాలు వాడారు, ఏవిధంగా నడుస్తుంది తెలియజేశారు. బ్యాటరీతో నడిచే ఈ వాహనం తయారీకి రూ.7 కోట్లు ఖర్చు చేసినట్లు సినిమా ప్రొడక్షన్ విభాగం ప్రతినిధి రమేష్ తెలిపారు. విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించడానికి, మన ఇంజినీర్ల ప్రతిభ తెలియజెప్పడానికి ఇక్కడ ప్రదర్శించినట్లు తెలిపారు. స్కూల్ క్రీడా మైదానంలో ఈ వాహనాన్ని నడిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ సూచనలతో ఈ వాహనం చూడడానికి విద్యార్థులను తరగతుల వారిగా ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. వాహనం గురించి వివరించారు. అక్కడ విద్యార్థులకు ఫొటోలు తీశారు. విషయం తెలుసుకొన్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలకు చేరుకొని ఆ వాహనం వద్ద ఫొటోలకు దిగారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ వైజయంతి మూవీస్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతానికి నాలుగు గేదెలు మృతి

వారం రోజుల తరువాత వెలుగు చూసిన వైనం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి సమీపాన గల మడేరు ఆనకట్ట గట్టుపై విద్యుత్ వైర్లు తగిలి నాలుగు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వ్యవసాయ మోటారు కోసం ఓ రైతు ఏర్పాటు చేసిన విద్యుత్‌వైర్లు ఇందుకు కారణమని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ సంఘటన జరిగిన వారం రోజుల తరువాత శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సంఘటన జరిగిన ప్రాంతంలో గేదెలు పూర్తిగా కాలిపోయి కనిపించడం గమనార్హం. ఈ సంఘటనా ప్రాంతాన్ని స్థానిక వెటర్నరీ వైద్యుడు తరుణ్ పరిశీలించారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జడ్డంగి గ్రామానికి చెందిన కాకూరు వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన మూడు పాడి గేదెలు, బాబ్జీ అనే రైతుకు చెందిన ఒక గేదె మేతకు వెళ్లితిరిగి ఇంటికి రాలేదు. కాగా వాటి కోసం వెతుకుతుండగా నాలుగు గేదెలు పూర్తిగా కాలిపోయి కనిపించాయి. రైతులు వాటికి పోస్టుమార్టం చేయాలని కోరినప్పటికి, పూర్తిగా కాలిపోవడంతో వీలుకాలేదన్నారు. పాడి గేదెలు మృతి వల్ల సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, రోజువారి ఉపాధి కోల్పోయామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు.



విద్యుదాఘాతానికి గురైన చోట మృతి చెందిన గేదెలు

గైనకాలజిస్ట్ లేక గర్భిణుల అవస్థలు

- మంచంగిపుట్టు సీహెచ్‌సీలో నిలిచిన అల్ట్రాసౌండ్ పరీక్షలు
- రెండు వారాలుగా ఇదే పరిస్థితి



ముంచంగిపుట్టు సీహెచ్‌సీ

ముంచంగిపుట్టు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో అల్ట్రాసౌండ్ పరీక్షలు నిలిచిపోవడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు వారాల క్రితం వరకు ప్రతి మంగళ, గురు వారాల్లో ఇక్కడ గర్భిణులకు ఉచితంగా అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించేవారు. గర్భధారణలో శిశువు పరిమాణం, హృదయ స్పందన, కడుపులో ఉండే విధానం, శిశువు యొక్క ఆరోగ్య పరిస్థితిని స్కాన్ ద్వారా గుర్తించి తగు సూచనలతో వైద్యం అందించేవారు. పాడేరు జిల్లా ఆస్పత్రి నుంచి గైనకాలజిస్ట్ వచ్చి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేసేవారు. రెండు వారాల నుంచి ఇక్కడ గైనకాలజిస్ట్ లేక గర్భిణులకు పరీక్షలు జరగడం లేదు. దీనివల్ల ప్రతి వారం 30 నుంచి 40 మంది 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాడేరు జిల్లా ఆస్పత్రికి అల్ట్రాసౌండ్ పరీక్షల నిమిత్తం వెళ్లాల్సి వస్తోందని గర్భిణులు వాపోతున్నారు. అల్ట్రాసౌండ్ పరీక్షలకు అన్ని సౌకర్యాలు ఉన్నా గైనకాలజిస్ట్ లేకపోవడంపై వారు మండిపడుతున్నారు. తక్షణమే వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి గైనకాలజిస్ట్‌ను నియమించాలని, గర్భిణుల స్కానింగ్ కష్టాలను తీర్చాలని వారు కోరుతున్నారు.ఈ విషయంపై స్థానిక వైద్యాధికారిణి గీతాంజలిని వివరణ కోరగా అల్ట్రాసౌండ్ పరీక్షలు రెండు వారాల నుంచి నిలిచిపోవడం వాస్తవమేనన్నారుజ. గైనకాలజిస్ట్ లేకపోవడం వల్ల ఎదురవతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని ఆమె తెలిపారు.

సకాలంలో రేషన్ పంపిణీ



జడ్డంగి ఎంఎల్ఎస్ గోదాంలో సరకుల రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి ఉమాదేవి

రాజవొమ్మంగి: రేషన్‌కార్డుదారులందరికీ సకాలంలో నాణ్యమైన సరకులు అందజేయాలని గిరిజన కార్పొరేషన్ విజిలెన్స్ అధికారి ఎంవీవీఎస్ ఉమాదేవి ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలోని జడ్డంగిలోని ఎంఎల్ఎస్ గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం పీడీఎస్ బియ్యం, తదితర నిత్యావసర సరకుల నిల్వలను పరిశీలించారు. వచ్చిన సరకు గోదాముల్లో నిల్వ చేయకుండా వెంటనే సంబంధిత డీఆర్ డిపోలకు తరలించాలని, అక్కడ నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ అందజేయాలని జీసీసీ మేనేజర్ విజయలక్ష్మిని ఆదేశించారు. వట్టిగెడ్డ, దూసరపాము తదితర డీఆర్ డిపోల్లో సరకులను తనిఖీ చేశారు. రాజవొమ్మంగి సూపర్‌బజార్‌ను తనిఖీ చేసి సరకులు విక్రయిస్తున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల పౌరసరఫరాల శాఖ నుంచి పీడీఎస్ బియ్యం మాత్రమే వచ్చాయన్నారు. కందిపప్పు, పంచదార సరఫరా కాలేదన్నారు. గోదాం సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

'ఇస్కాన్' రథయాత్రకు సర్వం సిద్ధం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: పూరీ తరహాలో నగరంలోని 'ఇస్కాన్' సాగర్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా రథయాత్ర నిర్వహించనున్నట్టు ఆ సంస్థ నగర అధ్యక్షుడు సాంబదాసు తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రథయాత్ర వివరాలు వెల్లడించారు. 16 ఏళ్లుగా దిగ్విజయంగా రథయాత్ర నిర్వహిస్తూ వచ్చామని, ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున రథయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రి అనిత పలువురు ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్టు చెప్పారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు సాగరతీరం వుడా పార్కు నుంచి వైఎంసీఏ, రామకృష్ణ మిషన్, కాళీ మాతా ఆలయం మీదుగా గురజాడ కళాక్షేత్రం వరకు రథయాత్ర అత్యంత వైభవంగా సాగనుందని చెప్పారు. అనంతరం స్వామికి 1008 రకాల వంటకాలతో ప్రసాదం నివేదించడం జరుగుతుందని తెలిపారు. మాతాజీ నితాయి సేవిని మాట్లాడుతూ 1967లో పూరీలో ప్రారంభమైన జగన్నాథస్వామి రథయాత్రను ఇప్పుడు ఇస్కాన్ ఆధ్వర్యంలో 250 దేశాల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. హారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేయనున్నట్టు చెప్పారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చిన్నారులచే విచిత్ర వేషధారణ, స్వామిని విశేషంగా అలంకరించనున్నట్టు చెప్పారు. సమావేశంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఇస్కాన్ అర్చకులు, సభ్యులు పాల్గొన్నారు.

20 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు మహిళల అరెస్ట్
- రూ.49 వేలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, చిత్రంలో సీఐ రామకృష్ణ

పెందుర్తి: ముంచంగిపుట్టు నుంచి వరంగల్ ప్రాంతానికి తరలిస్తున్న గంజాయిని పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. ఆర్టీసీ బస్‌లో గుట్టుచప్పుడు కాకుండా ఇద్దరు మహిళలు ఈ గంజాయిని తరలిస్తుండగా.. పక్కా సమాచారంతో పెందుర్తి మండలం పినగాడి వద్ద మాటు వేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 20 కిలోల గంజాయి, రూ.49వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఈ వివరాలను ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి వెల్లడించారు. ఏజెన్సీలో లభ్యమవుతున్న గంజాయిని వరంగల్‌కు తరలించేందుకు అక్కడి ముఠా సభ్యులు ఒప్పందం చేసుకున్నారు. ముంచంగిపుట్టు ప్రాంతంలో సేకరించిన గంజాయిని ఇద్దరు మహిళలు రెండు సంచుల్లో సర్దుకుని ముందుగా నగరానికి తరలించేందుకు.. అక్కడి నుంచి వరంగల్‌కు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో పాడేరులో గంజాయి సంచులతో బస్ ఎక్కారు. అయితే పినగాడి వద్ద బస్‌ను పెందుర్తి పోలీసులు తనిఖీ చేయగా అందులో నుంచి ఇద్దరు మహిళలు పారిపోయేందుకు ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. గంజాయి వినియోగం వల్ల యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఏసీపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ గంజాయి సమాచారం ఉన్నా 94407 96008(ఏసీపీ), 94407 96039(సీఐ)కు సమాచారం ఇవ్వాలన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్‌ఐ సింహాచలం పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

ఏయూక్యాంపస్: అగ్నివీర్ వాయు స్కీంలో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి(టెక్నికల్–అన్‌స్కిల్) కె.శాంతి తెలిపారు. జూలై 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 28వ తేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అర్హులైన అభ్యర్థులు www.agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రంగస్థల అద్భుతం 'మాయాబజార్'

మద్దిలపాలెం : రెప్పవేసి తెరిచేలోగా ఎన్నో అద్భుతాలు... ఘటోత్కచుని అసమాన నటనా కౌశలం... శశిరేఖ అభిమన్యుల పరిణయ కోలాహలం... వెరసి సురభి కళాకారులు మాయాబజార్ నాటికతో మురిపించారు. శుక్రవారం రాత్రి కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించిన మాయాబజార్ నాటకం ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. వైరు వర్కుతోనే రంగస్థలంపై మంటలు సృష్టించడం... వర్షం కురిపించడం, వస్తువులను అదృశ్యం చేయడం... ఔరా అనిపించాయి. అద్భుతమైన సెట్టింగ్‌లతో సురభి మాయాబజారు నాటకం ప్రేక్షకులు అలరించింది. మద్దిలపాలెం కళభారతి ఆడిటోరియంలో శుక్రవారం మాయా బజారు నాటకాన్ని ప్రదర్శించారు. రంగస్థలంపై సినిమా చూసిన అనుభూతి కలిగించేలా అద్వితీయంగా ప్రదర్శించారు. అద్యంతం ప్రేక్షకులను తన్మయత్వానికి లోనయ్యారు. ప్రతి సన్నివేశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దా రు. మనోరంజకమైన దృశ్యమాలికలతో ఆహ్లాదకంగా అలరించారు. రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో బాదంగీర్ సాయి నేతృత్వంలో ప్రదర్శించిన ఈ నాటకానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు.

జంతు ప్రేమ.. జాగ్రత్త సుమా!

- జంతువుల నుంచి మనుషులకు పొంచి ఉన్న వ్యాధులు
- అప్రమత్తతే శ్రీరామరక్ష
- నేడు వరల్డ్ జూనోసిస్ డే

ఆరిలోవ: మూగజీవాలంటే చాలా మందికి అమితమైన ప్రేమ ఉంటుంది. ఉదయం లేచి దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ వాటితోనే గడుపుతుంటారు. అవి కూడా వారి కుటుంబంలో భాగంగా మారతాయి. అయితే జంతువుల లాలాజలం, తాకిడి, విసర్జకాల ద్వారా అనేక వ్యాధులు మనుషులకు సంక్రమిస్తాయి. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే వరల్డ్ జూనోసిస్ డే ప్రధాన లక్ష్యం. రేబిస్ వ్యాక్సిన్ కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ కుక్కకాటు బాధితుడికి మొదటిసారి వ్యాక్సిన్ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ ఏటా జూలై 6న వరల్డ్ జూనోసిస్ డే నిర్వహిస్తున్నారు.

జూనోసిస్ అంటే...

జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే అసాధారణ ఆరోగ్య స్థితిని వైద్య పరిభాషలో జూనోసిస్ అంటారు. పెంపుడు జంతువులు, సంచార జీవుల నుంచి మనుషులకు అనేక వ్యాప్తి చెందుతాయి. వీటిని సంక్రమిత వ్యాధులు అంటారు. ఏ జంతువుల నుంచి ఏ వ్యాధులు సంక్రమిస్తామో పశు వైద్య విభాగం చినగదిలి మండలం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు వివరించారు.

- ఆవులు, గేదెల జాతుల నుంచి ఆంత్రాక్స్, రేబిస్, గాలికుంటు, క్షయ, తామర, మశూచి, క్యూఫీవర్, ఫైలేరియాసిస్ సంక్రమిస్తాయి.
- కుక్కలు, పిల్లుల నుంచి రేబిస్, కాట్ స్క్రాచ్ ఫీవర్, తామర, టాక్సోప్లాస్మోసిస్, లార్వా మైగ్రాన్స్ వ్యాప్తి చెందుతాయి.
- ఎలుకల నుంచి ప్లేగు, లెప్టోస్పైరోసిస్ సంక్రమిస్తాయి.
- పందుల నుంచి మెదడు వాపు, గాలికుంటు, ఇన్ ఫ్లూయంజా, బ్రూసెల్లోసిస్, లిస్టీరియోసిస్, సాల్మోనెల్లాసిస్, హైడాటిడోసిస్ వస్తాయి.
- గొర్రెలు, మేకల వల్ల రేబిస్, ఆంత్రాక్స్, హైడాటి డోసిస్, క్యూ ఫీవర్, ట్రిపన్ సోమియాసిస్ వ్యాప్తి చెందుతాయి.
- గుర్రాల నుంచి ఇన్‌ఫ్లూయంజా, రేబిస్, ఆంత్రాక్స్, తామర, గ్లాండర్స్, లిష్మేనియాసిస్ వ్యాప్తి చెందుతాయి.
- కోళ్లు, పక్షుల వల్ల ఇన్‌ఫ్లూయంజా, తామర, సిట్ట కోసిస్, సాల్మోనెల్లోసిస్, లిస్టీరియోసిస్, క్లమీడియోసిస్ అనే వ్యాధులు ఆశిస్తాయి.

కుక్క కరిస్తే ఏం చేయాలి?

పిచ్చి కుక్కలు కరవడం వల్ల మనుషులకు, ఇతర జంతువులకు రేబిస్ వ్యాధి సంక్రమిస్తుంది. పిచ్చి కుక్క లాలాజలంలో రేబిస్ కారక వైరస్ ఉంటుంది. ఇది కరిచిన మనిషి నరాల్లోకి చేరుతుంది. పశువులకు కరిస్తే బాగా అరుస్తాయి. చొంగ కార్చుతూ తీవ్ర జ్వరానికి గురవుతాయి. మనుషులకు కరిస్తే తీవ్ర జ్వరం వస్తుంది. ఈ లక్షణాలు బయటపడిన 4, 5 రోజుల్లో పశువులు మరణిస్తాయి. కుక్క కరిచిన భాగంలో వెంటనే వేడి నీటితో కడగాలి. కరిచిన భాగంపై అయోడిన్ వేయాలి. కుక్క కరిచిన భాగాన్ని బట్టి వైరస్ మెదడుకు చేరడానికి 7 రోజుల నుంచి ఒక సంవత్సరం పడుతుంది. ఈ మధ్య కాలంలో మనిషి మరణించే ప్రమాదం ఉంది. అందుకే కుక్క మనిషిని కరిచిన వెంటనే రేబిస్ టీకా వేయించుకోవాలి. కుక్క కరిచినప్పటి నుంచి నెల రోజుల్లో తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ ఐదు డోసులు వేయాల్సి ఉంటుంది. కుక్కలు టీకాలు వేయిస్తే.. అవి మనుషులకు కరిచినా ఎలాంటి ప్రమాదం ఉండదు.

అప్రమత్తత అవసరం

మనుషుల వల్ల మూగజీవాలకు కూడా హాని జరుగుతుందని వైద్య నిపుణులు వివరిస్తున్నారు. సుమారు 200 రకాల వ్యాధులు మనుషుల నుంచి మూగజీవాలకు వ్యాప్తి చెందుతాయని చెబుతున్నారు. ఈ స్థితిని వైద్య పరిభాషలో రివర్స్ జూనోటిక్ డిసీజ్ ట్రాన్స్ మిషన్ అని, జూ అంత్రో పోనోసిస్ అంటారన్నారు. జూనోసిస్ రిస్క్ అధికంగా ఉన్న వర్గాలను వైద్యులు గుర్తించి జాగ్రత్తలు సూచిస్తున్నారు. గర్భిణులు, ఐదేళ్ల కంటే చిన్న, 65 ఏళ్ల కంటే పెద్దవారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కీమోథెరపీ బాధితులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఎక్కువగా వ్యాధులు బారిన పడే అవకాశం ఉందన్నారు. జంతువులు కరవడం, గోళ్ల ద్వారా గాయం కావడం, వాటి తుంపర్ల ద్వారా, ఆహారాన్ని పంచుకోవడం, రోగాల బారిన పడిన జంతువులను తాకడం, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న జంతువుల ద్వారా వ్యాధులు సంక్రమిస్తాయని వివరించారు.

అవగాహన కల్పిస్తున్నాం



జూనోసిస్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరం. జంతువులు నుంచి జంతువులకు, మనుషులకు వ్యాపించే వ్యాధులనే జూనోసిస్ వ్యాధులంటాం. ఇవి 150 వ్యాధుల వరకు ఉంటాయి. జునోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నాం. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేస్తాం. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – డాక్టర్ శ్రీనివాసరావు, ఏడీ, పశు సంవర్ధక శాఖ, చినగదిలి మండలం

సాక్షి క్లాసిఫైడ్స్

Education

COACHING CENTRES

■ 10th / INTER / DEGREE ఫెయిల్ అయ్యారా? Don't Worry! Complete in Short period & Join further Studies in 2024-25 Academic Year. Pass Guarantee Guidence. Ph : 90599 10102 [V- 2614]

Real Estate

FLAT FOR SALE

■ 2560 Sft. Each 5 Floors N/F, 80 Sqyds UDS, 3 Months Ready to occupy. 2 Car Parkings, Prime Area RK Reach Road, Pandurangapuram. Ph : 89787 63496 [V- 6512]

■ 3 BHK Flat (1205 Sq.ft) Muralinagar, Visakhapatnam. Cell: 9849268224 [S-793955]

HOUSE FOR SALE

■ పెందుర్తి పోలీస్ స్టేషన్ రోడ్‌లో 147 చ॥గ॥లో సెల్లార్ + 2BHK, W/S, 2 రోడ్లు కార్నర్ (5 Years old) 40 F రోడ్‌తో అమ్మకం : లోన్ సౌకర్యం. ఫోన్ : 94907 95530 [V- 0183]

PLOT FOR SALE

■ పెందుర్తి దగ్గరలో 3 నేషనల్ హైవేస్ మధ్యలో 200 ft. రోడ్డు ఫేసింగ్‌లో 68 ఎకరాల లే అవుట్‌లో గజం @8,499/- & సింప్లెక్స్ 2 BHK హౌస్ @ 36L, డూప్లెక్స్ 3 BHK @ 45L (ఆఫర్). 100%. బ్యాంక్ లోన్. @ 98869 57795 [V- 3126]

■ పెందుర్తి టు అగనంపూడి రోడ్డుకి 4 కి.మీ.దూరంలో 100 గజాలు 6 లక్షలు. (ఉదా) GVMC వార్డు పరిధిలో 100 గ॥లు 4 లక్షలు. EMI కలదు. ఫోన్ : 73867 55281 [V- 786922]

■ గాజువాక 16 km దేశపాత్రునిపాలెం దగ్గరలో రెడ్ శాండిల్ మొక్కలతో చుట్టూ బౌండరీ మరియు ఆర్చితో 30 రోడ్స్‌తో 130 నుండి ప్లాట్స్ రూ. 6900/- మాత్రమే. ఫోన్ : 91542 33332 [V- 791082]

■ Residential Plot for Sale, 333 Sq. yrd. VMRDA APPROVED. Near BHOGAPURAM. Contact Owner : 8956700894 [HA-02428]

■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 18,500/- సంప్ర: ✆ 63028 55524 [B-33]

Services

■ ఓం శ్రీమురుగన్ వారాహిదేవి శక్తి పీఠం - తమిళనాడు : మావద్ద కరుంగలి రుద్రాక్షమాల కావలసిన వారు సంప్రదించండి. గొర్లెవానిపాలెం కోలనీ, లోయోలా ఐ.టి.ఐ కాలేజ్, పెందుర్తి. ఫోన్ : 70132 20262 [V- 0232]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12256]

OLD AGE HOME

■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [V- 786892]

SEPTIC TANK CLEAN

■ విజయ్ సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ హైటెక్ మిషన్‌తో ఇరుగుపొరుగు వారికి ఎలాంటి దుర్వాసన లేకుండా 5 ని॥ల్లో క్లీన్ చేయ్యబడును. ఫోన్ : 93931 55552, 96765 57552 [V-2605]

www.sakshi.com

Wanted

■ మా కంపెనీలో పనిచేయుటకు Telecallers (F), Computer Operators (F), Supervisors (M) కావలెను. ఫోన్: 93917 74756. [V-1021]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-28 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217 [M-1185233]

■ సెల్‌ఫోన్, DTH రీఛార్జీల ద్వారా 8.5% CASHBACK. రూ. 1200తో (తెలుసుకొన్నవారికి ఆకర్షణీయమైన బహుమతి. మీరు కొనిపించడం ద్వారా ఆకర్షణీయమైన బహుమతి. ఆసక్తిగలవారు సంప్రదించగలరు. Ph: 93930 68546 [V-2616]

■ Vizagలో 18సం॥ చరిత్ర కలిగిన కంపెనీ Expansion కొరకు 30 సం॥పై బడిన M/F, House wifes, Rtd Person, Customer Relationship Managers కావలెను. Sal+Incen కలదు. ఫోన్: 89781 05690. [V- 12194]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K సంప్ర : 9640258899, 9640468899 [H-796175]

■ RK ఇంజనీరింగ్ కాలేజీలో వంట చేయుటకు వంట మాస్టర్స్ మరియు ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్క్ చేయుటకు అనుభవం కలిగిన ఎలక్ట్రీషియన్స్ ప్లంబర్స్ వెంటనే కావలెను. మంచిజీతం + భోజనం + ఉచిత వసతి కల్పించబడును. సంప్ర: కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. సెల్. 97014 73399 [G-120]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం